06ATP27_06ATP27.qxd 25-03-2024 PM 11:02 Page 1



# నియోజకవర్గంలో అధికమవుతున్న పంటల దొంగతనాలు..!

**- పంట పొలాల్లో ఉండగానే మాయం చేస్తున్న దొంగలు - ఆరుగాలం శ్రమ దొంగలపాలై లబోదిబోమంటున్న రైతులు**

**- ఎండు మిరప పంటకు అధికమవుతున్న దొంగల బెడద - ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట వ్యవసాయ పనిముట్ల చోరీలు**





ఉలువల పంట (ఫైల్ ఫోటో) ,పొలాల్లోనే ఎండు మిరప పంటను శుద్ధి చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 25 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలో పంటల దొంగతనాలు అధికమవుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించి కన్నబిడ్డలకంటే ఎక్కువగా చూసుకున్న పంటలు పొలంలో ఉండగానే దొంగలు ఎత్తికెళ్లిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా చాలా ఖరీదైన ఎండు మిరప పంటకు దొంగల బెడద అధికంగా ఉందని చెప్పాలి. రైతులు ఎకరాకు లక్ష రూపాయలకు పైగానే డబ్బులు పెట్టుబడి పెట్టి సాగుచేయగా ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలను తట్టుకొని చేతికందిన పంటను పీకి శుద్ధిచేసి సంచుల్లో నింపుకోవడం కోసం పొలాల్లోనే నిల్వ ఉంచడం ఉరవకొండ ప్రాంతంలో జరుగుతోంది. అయితే కొన్ని చోట్ల దొంగలు వాటిపై కన్నేసి క్వింటాళ్లకు క్వింటాళ్ళు మిరపను వివిధ వాహనాల్లో వచ్చి చోరీ చేసి తరలించుకొని వెళ్లిన ఘటనలు అనేక ఇటీవలి కాలంలో అధికంగానే చోటు చేసుకున్నాయి. ఉరవకొండ మండలం వై.రాంపురం గ్రామంలో రెండు, మూడు నెలల క్రితం మిరప పంట చోరీకు గురికాగా రెండు రోజుల క్రితం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో కూడా మిరప పంట పొలం నుండే చోరీకు గురైందని సమాచారం. ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామంలో దాదాపు 10 క్వింటాళ్ల వరకు ఉలువ పంట పొలం నుండే చోరీకు గురైందని తెలుస్తోంది. ఇక వ్యవసాయ పనిముట్ల చోరీల విషయానికొస్తే కో కొల్లలని చెప్పాలి. స్ప్రింక్లర్, డ్రిప్ పైపులు, విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, విద్యుత్ కేబుళ్లను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్న ఘటనలు అనేకం చోటు చేసుకొంటున్నాయి. చోరీలపై కొందరు మాత్రమే పోలీసులు ఆశ్రయిస్తుంటే ఎక్కువ భాగం రైతులు పోలీసులకు పిర్యాదు చేయడం ఇష్టంలేక పిర్యాదు చేసినా ఫలితం ఏముంటుందని భావించి లోలోనే మదన పడుతున్నారు. శ్రమ రైతులది, ఫలితం చోరీలకు పాల్పడే దొంగలది అన్న విధంగా నియోజకవర్గంలో పంటల దొంగతనాలు ఇటీవలి కాలంలో అధికమవుతున్నాయి. పంట పెట్టి మూడు, నాలుగు నెలలు సేద్యంచేసి వేలు, లక్షల రూపాయలు ఖర్చుపెట్టి పంట పండిస్తే కోడిపిల్లలను గద్దలు ఎత్తుకెళ్లినట్లు కొన్ని మండలాల్లో దొంగలు పంటలను ఎత్తుకెళ్లిపోతుండటం బాధాకరమని చెప్పాలి. పండిన పంటలను నిల్వ చేసుకోవడానికి సరైన సదుపాయాలైన గోదాములు, కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతోనే వారాలు, నెలలపాటు పంటలను పొలాల్లోనే రైతులు భద్రపర్చుకోవాల్సి వస్తోందని తెలుస్తోంది. పాలకులు రైతుల అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపట్టాలి ్స ఉంది. పంటల దొంగతనాలను అరికట్టడానికి పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరించి రైతుల ఆరుగాలం శ్రమ దోపిడీ కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేస్తే కఠిన చర్యలు

**- సరిహద్దులో 9 చెక్ పోస్టులు ఏర్పాటుకు చర్యలు**

**- సిఐలు రాజ్‌కుమార్, మనోహర్‌లు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐలు మనోహర్ రాజ్‌కుమార్

**మడకశిర టౌన్, మార్చి 25 ప్రభాతవార్త**

మడకశిర నియోజక వర్గంలో వాట్సాప్‌లలో ఫేస్‌బుక్‌లలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మడకశిర రూరల్, అర్బన్ సిఐలు రాజ్‌కుమార్, మనోహర్ కోరారు. వారు సోమవారం సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంయుక్త విలేకర్ల సమావేశం మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు. ప్రధానంగా సోషల్ మీడియాపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో సోషల్ మీడియా పోలీసులను పరిశీలించి చర్యలు తీసుకోవడానికి ఒక కమిటీ ఉన్నట్లు తెలిపారు. ఈ కమిటీ సూచనల మేరకు సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో వైషమ్యాలు పెంచే పోస్టు పెట్టకూడదన్నారు. రెచ్చగొట్టే వ్యక్తిగతంగా కించపరిచే పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాట్సాప్ గ్రూప్‌ల అడ్మిషన్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తప్పుడు పోస్టులకు ఆయా గ్రూపుల అడ్మిషన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని సరిహద్దులో 9 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 24 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆమిద్యాల గ్రామంలో అగ్నిప్రమాదం

**-రెండు గడ్డివాములు దగ్ధం, రూ.30వేలు నష్టం**

**ఉరవకొండ, మార్చి 25 ప్రభాతవార్త**



గడ్డివాముల్లో చెలరేగిన మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంలో సోమవారం మధ్యాన్నం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామస్థుడు ఎస్.గోపికు చెందిన రెండు గడ్డివాములు దగ్ధంకాగా 30వేల రూపాయలు అస్తినష్టం సంభవించింది. వామిదొడ్డిలో గడ్డివాములపై నుండి వెళ్లిన విద్యుత్ తీగల నుండి నిప్పురవ్వలు గడ్డివాములపై పడటంతో మంటలు చెలరేగాయి. బాధిత రైతు స్థానికుల సాయంతో మంటలను అదుపు చేయడానికి యత్నిస్తూనే ఉరవకొండ విపత్తు నివారణ, అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక వాహనం వెంటనే గ్రామానికి చేరుకొని సిబ్బంది మంటలు చుట్టుపక్కలకు వ్యాపించకుండా ఆర్పివేశారు. ప్రమాదంలో బాధిత రైతుకు 30వేల రూపాయలు ఆస్తినష్ట సంభవించింది.

## వైఎస్సార్‌సీపీ నాయకుల భూదాహంవల్లే చేనేత కుటుంబం ఆత్మహత్య

**-సుబ్బారావు కుటుంబానికి న్యాయం చేయాలన్న టీడీపీ చేనేత నాయకులు**

**ఉరవకొండ, మార్చి 25 ప్రభాతవార్త**



సుబ్బారావు కుటుంబం చిత్రపటంవద్ద పూలువేసి నివాళులర్పిస్తున్న టీడీపీ చేనేత విభాగం నాయకులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల భూదాహంవల్లే కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబం ఈనెల 23వ తేదీన ఆత్మహత్య చేసుకుందని ఉరవకొండ నియోజకవర్గ టీడీపీ చేనేత నాయకులు ఆరోపించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబ సభ్యుల చిత్రపటంవద్ద పూలువేసి నివాళులర్పించి వారి ఆత్మశాంతికై రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం చాలా బాధాకరమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సుబ్బారావు కుటుంబానికి చెందిన భూమి ఆయన కుటుంబ సభ్యులకు చెందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ నియోజకవర్గ టీడీపీ చేనేత నాయకులు వేల్పుల శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దకోట్ల రాజేష్, నాయకులు పెద్దకోట్ల శ్రీనివాసులు, పల్లా నరసింహులు, నిమ్మల ప్రసాద్, చంగల నాగరాజు, చిట్టా రఘు, చంగల అమరేష్, వీరేష్, ఎస్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల మధ్య రంగుల పండుగ 'హోలీ'

**ఉరవకొండ, మార్చి 25 ప్రభాతవార్త**



హోలీ పండుగను జరుపుకొంటున్న చిన్నారులు

రంగుల పండుగ హోలీ సోమవారం ఉరవకొండ పట్టణం తోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆనందోత్సవాల మధ్య జరిగింది. చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ఒకరికొకరు రంగులు పూసుకుంటూ ఎంతో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. వసంత ఋతువు ఆగమనానికి చిహ్నంగా ఈ పండుగను ప్రతి ఏడాది పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రాక్షస రాజైన హిరణ్యకశిపుడు బ్రహ్మ వరంతో విష్ణుమూర్తి మీద కోపంతో హద్దులు మరచి దేవతలను, మునులను అనేక రకాలుగా హింసిస్తాడు. దీంతో విష్ణుమూర్తి ప్రభావముతో హిరణ్యకశిపుడికి ప్రహల్లాదుడు జన్మిస్తాడు. ప్రహల్లాదుడు ఎపుడూ తనశత్రువైన విష్ణువుని ధ్యానించడం ఇష్టంలేని హిరణ్యకశిపుడు అనేక రకాలుగా చంపాలని ప్రయత్నించి విఫలమవుతాడు. దీనితో తన చెల్లెలైన బ్రహ్మారాక్షసి హోళికను ప్రహల్లాదున్ని చంపడానికి పంపుతాడు. ప్రహల్లాదుడు తనను రక్షించమని విష్ణుమూర్తిని వేడుకోగా విష్ణువు ప్రభావంచేత హోళిక మరణిస్తుంది. హోళిక మరణించినందుకు గుర్తుగా ఆనందోత్సహాలతో హోలీ పండుగను జరుపుకొంటారు. కరువు పరిస్థితుల కారణంగా తండాల్లో గిరిజనులు పండుగను జరుపుకోలేదని తెలుస్తోంది.

## అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఎన్నికలకు సిద్ధం

**పుట్టపర్తి రూరల్ మార్చి 20 ప్రభాతవార్త**



ఫార్వాడ్డ్ బ్లాక్ పార్టీ నేతలను ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

శ్రీ సత్యసాయి జిల్లాలో అఖిల భారత ఫార్వాడ్డ్ బ్లాక్ పార్టీ ఎన్నికలలో పోటి చేయనుందని ఆ పార్టి జిల్లా ప్రధానకార్యదర్శి నీలు మామిడి విష్ణు నారాయణ పెర్కొన్నారు. ఆయన సోమవారం పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో ఆత్మీయుల ఆహ్వానం మేరకు బత్తలపల్లి గ్రామానికి విచ్చేశారు. రాబోవు ఎన్నికలలో అఖిల భారత ఫార్వాడ్డ్ బ్లాక్ పార్టి పోటీ చేయనుందని ప్రజలు సహకరించాలని పార్టి గురించి పలు విషయాలు గ్రామ ప్రజలకు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నిడిమామిడి విష్ణు నారాయణ మాట్లాడుతూ మార్చి 31 న సత్యసాయి జిల్లా పుట్టపర్తి లో నిర్వహిచబోయే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లావిస్తృత స్థాయి సమావేశంలో ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజవంతం చెయ్యాలని కోరారు. ఎన్నకలు దగ్గర పడుతున్న సందర్భంలో భారత ఫార్వాడ్డ్‌బ్లాక్‌పార్టీ జిల్లానాయకత్వం పార్టీగెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికలలో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పోటికి సిద్దంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా చోళమాంబ దేవి మండల పూజా కార్యక్రమం



ప్రత్యేక అలంకరణలో చోళమాంబ, హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**అమరాపురం, మార్చి 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వెలసిన పురాతన కాలం నాటి శ్రీ చోళమాంబ దేవికి సోమవారం అమరాపురం, పులికుంట, వీరాపురం, మద్దనకుంట, బంగారుపాళ్యం గ్రామాలకు చెందిన ప్రజలు మండల పూజా కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించడంతో పాటు హోబాధి కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. గ్రామ దేవత ఉత్సవాలు జరిగి 48 రోజులు పూర్తి అయిన సందర్భంగా ఆలయకమిటీ ఆధ్వర్యంలో మరియుదేవాలయానికి సంబందించిన అన్నిగ్రామాల ప్రజలసహకారంతో మండలపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటి నుండి మహిళలు అమ్మవారికి విశేషపూజలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు దేవాలయ కమిటి అధ్యక్షుడు శివకుమార్ గౌడ్, యజమానులు మాదేరు యంజారప్ప, మాదేరు శివన్న, సానుభూగరు సుహాన్, సిద్ద లింగప్ప, వీరక్యాతప్ప, రామలింగప్ప, నాగేంద్రప్ప, గొంచుకారు సిద్దేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిఉత్సవాలుజరిగి 102సంవత్సరాలు అయిన తరువాత పెద్దజాతరఉత్సవాలు జరగడంతో మండల పూజ నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ మరియు వేద పండితులు పాల్గొన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

# కర్ణాటక వార్తలు

## మైసూరులో సిఎం మకాం రెండు లోక్‌సభ సీట్లను గెలిపించేందుకు వ్యూహం

**మైసూరు,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి:**

మైసూరుకొడగు, చామరాజనగర లోక్ సభ సీట్లను ఎక్కువ మెజారిటీతో గెలిపించేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం పార్టీ నాయకులతో మంతనాలు జరిపారు. ఈ రెండు జిల్లాల్లో బిజెపి జెడిఎస్ పొత్తును వ్యతిరేకించే ఆయా పార్టీల అసమ్మతి నాయకులను కాంగ్రెస్‌లో చేర్చేందుకు చురుగ్గా చర్యలు తీసుకోవాలని కేడర్‌కు సూచించారు. నాయకులు అందరూ కలసికట్టుగా పనిచేస్తే ఈ ఎన్నికల్లో గెలవటం పెద్ద లెక్క కాదన్నారు. చామరాజనగర సీటులో డాక్టర్ మహదేవప్ప తనయుడు సునీల్ బోస్‌కు టిక్కెట్టు ఇచ్చి గెలిపించాలని సహచరులను కోరారు. నేను ప్రాతినిధ్యం వహించే ఈ రెండు జిల్లాల సీట్లు ఈసారి తప్పకుండా గెలవాల్సిందే అని కోరారు. ఇప్పటికే నంజనగూడు, మైసూరు తాలూకాల్లో పలువురు బిజెపి జెడిఎస్ నాయకులను కాంగ్రెస్‌కు చేర్చుకున్నారు. ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకున్న సిఎం సిద్దరామయ్య మైసూరులో రెండురోజులు మకాం వేసి పార్టీ శ్రేణుల్ని కదిలిస్తున్నారు. మైసూరు కొడగు కాంగ్రెస్ అభ్యర్థి దళవాయి లక్ష్మణ్ విజయం కోసం అందరూ పనిచేయాలని సిఎం కోరారు.

## మండ్య నుంచి కుమారస్వామి పోటీ

**బెంగళూరు,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**



మాజీ సిఎం కుమారస్వామి.

మండ్య లోక్‌సభ సీటుకు ఈసారి జెడిఎస్ పార్టీ అధ్యక్షుడు హెచ్‌డి.కుమారస్వామి పోటీ చేస్తారు. ఆయన సోమవారం బెంగళూరులోని తన నివాసంలో చెన్నపట్టణ తాలూకా జెడిఎస్ కార్యకర్తలు నాయకుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ సంక్షేమం కోసం ఈసారి మండ్య లోక్‌సభ ఎన్నికల గోదాలో దిగుతానని స్పష్టం చేసినట్లు సమాచారం. పార్టీ గెలిస్తే వచ్చేరోజుల్లో పార్టీకి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తాను మండ్యసీటులో గెలిస్తే చెన్నపట్టణ విధానసభ సీటుకు రాజీనామా చేస్తానని అన్నారు. ఆతరువాత కూడా చెన్నపట్టణ సీటును జెడిఎస్ పార్టీకే కేటాయిస్తామని తెలిపారు. చెన్నపట్టణ తాలూకా అభివృద్ధికి తాను అన్ని రకాల సాయం అందచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో జెడిఎస్ పార్టీని కాపాడుకునేందుకు పార్టీ కేడర్‌ను రక్షించుకునేందుకు తనకు వేరే దారిలేక బిజెపి తో ఎన్నికల పొత్తు పెట్టుకున్నట్లు చెప్పారు. కాగా యువజనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి మాట్లాడుతూ తన తండ్రి కుమారస్వామి మండ్య లో పోటీ చేయటం గురించి మంగళవారం జరిగే జెడిఎస్ పార్టీ కోర్‌కమిటి సమావేశం తీర్మానం చేస్తుందని చెప్పారు.

## మండ్యలో కాంగ్రెస్‌పార్టీలోనికి మాజీ ఎంఎల్‌ఎలు

**- మంత్రి చెలువరాయ స్వామి**

**మండ్య,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్య జిల్లాలో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణగౌడ అలియాస్ స్టార్ చంద్రును గెలిపించేందుకు బిజెపి జెడిఎస్ పార్టీల నుంచి మాజీ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని మండ్య ఇంఛార్జీ మంత్రి ఎన్.చెలువరాయస్వామి చెప్పారు. ఆయన సోవారం మండ్యలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సిట్టింగ్ ఎంపీ సుమలతకు టిక్కెట్టు ఇవ్వకుండా జెడిఎస్‌కు కేటాయించటాన్ని నిరసిస్తూ కెఆర్‌పేట బిజెపి మాజీ మంత్రి నారాయణగౌడ కాంగ్రెస్‌లో చేరతారని తెలిపారు. ఆయన ఇప్పటికే కాంగ్రెస్ నాయకులతో చర్చించారని అన్నారు. జెడిఎస్ నాయకులు మరితిబ్బేగౌడ, మరికొందరు నాయకులు ఆపార్టీను వదిలిపెట్టి కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. ఈ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకు సపోర్ట్ చేసేందుకు సుమలత ముందుకు వస్తే సహకారం అందిస్తామని మంత్రి చెలువరాయస్వామి చెప్పారు.

## కర్ణాటకలో మరో నాలుగు సీట్లకు అభ్యర్థులను ప్రకటించిన బిజెపి

**బెంగళూరు, మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో తొలివిడత జాబితాలో 20సీట్ల అభ్యర్థులను ప్రకటించిన బిజెపి మరో నలుగురు అభ్యర్థులను తాజాగా ప్రకటంచింది. చిక్కబళ్లాపుర సీటుకు డాక్టర్ కె.సుధాకర్, రాయచూరుకు రాజా అమరేశ్వర నాయక్, కారవారకు విశ్వేశ్వర హెగ్డె కాగేరి, బెళగావి సీటు మాజీ సిఎం జగదీశ్ షెట్టర్‌ను తన అభ్యర్థులుగా ప్రకటించింది. వీరిలో ఈ నలుగురు కూడా ఈసారి కొత్త అభ్యర్థులే. ఇప్పటికి ఆపార్టీ 25సీట్లకు 24మందిని నిలబెట్టింది. చిత్రదుర్గ సీటులో ఎవరనేది ఇంకా తేలాల్సి ఉంది.

## శివమొగ్గ జిల్లాలో రెండు విషాద సంఘటనలు ఇఉవురు విద్యార్థులు దుర్మరణం

**శివమొగ్గ,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

శివమొగ్గ జిల్లాలో సోమవారం రెండు వేర్వేరు సంఘటనల్లో ఇరువురు పదో తరగతి విద్యార్థులు మృతి చెందారు .పోలీసులు తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని సాగర తాలూకా యడేహళ్లి గ్రామానికి చెందిన పరశురామబాబు (16)ఈరోజు ఎస్సెఎల్సీ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటే ఇతగాడు తన ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరోక సంఘటనలో భద్రావతి తాలూకా మూడల వితలాపుర గ్రామంలో పదో తరగతి పరీక్షకు హాజరుకావాల్సిన ఉమ్మె కుల్సుం (16) బంధువుల ఇంటి నుంచి పరీక్షలకు హాజరయ్యేందుకు బస్సు కోసం రోడ్డు దాటుతుండగా ఇన్నోవా కారు ఢీకొట్టడంతో విద్యార్థిని స్థలంలో మృతి చెందింది. పోలీసులు కారు ఓనర్‌ను అదుపులోనికి తీసుకున్నారు.

## మైనారిటీల రక్షణ బహుసంఖ్యాకుల కర్తవ్యం : ప్రకాష్‌రాజ్

**మంగళూరు,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

దేశంలో మైనారిటీలను రక్షించాల్సిన బాధ్యత ఆయా దేశాల్లోని బహుసంఖ్యాకుల సముదాయం కర్తవ్యం అని సినీనటుడు ప్రకాష్‌రాజ్ చెప్పారు. ఆయన సోమవారం మంగళూరు బల్మఠ లో దక్షిణకన్నడజిల్లా జనపర సంఘాల సమావేశంలో మాట్లాడారు. దేశంలో హిందువులు బహుసంఖ్యాకులుగా ఉన్నారు. వారే ఈదేశం లోని మైనారిటీలను తమ సోదరులనే భావంతో రక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బహు సంఖ్యాకులు దేశంలోని అన్ని హక్కులను వినియోగించుకుంటున్నారు. అలాగే మైనారిటీల హక్కుల కాపాడేందుకు కూడా కంకణబద్దులై ఉండాలని కోరారు దేశానికి ఇపుడు సమానత్వం సహోదరత్వం, అందరిని సమాజంలోని భాగంగా చూసే ప్రజల అవసరం చానేలా ఉందని చెప్పారు. నేను ప్రధాని మోదీని సైద్దాంతికంగానే వ్యతిరేకిస్తున్నాను. ఆయనంటే నాకు వ్యతిరేకత లేదని చెప్పారు. మోదీ మొదటిసారి అధికారానికి వచ్చినపుడు స్విస్ బ్యాంకుల్లోని భారతీయుల నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతీ భారతీయుడు ఖాతాలో 15లక్షల రూపాయల వంతున జమచేస్తామన్నారు. ఏడాదికిరెండుకోట్లమంది యువకులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. దేశంలో అందరూ బాగుండాలని సబ్‌కాసాత్ సబ్‌కావికాస్ అంటున్నారు. ఏవీ ఇవన్నీఆచరణలో కనిపించటం లేదన్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో దేశ రాజ్యాంగాన్ని కాపాడే శక్తులకు వ్యతిరేకించే శక్తులకు మధ్య పెద్ద పోటీ జరుగుతోందని చెప్పారు. దేశం ఎదిరిస్తున్న ప్రధాన సమస్యల గురించి ఆన్సర్ మీ మిస్టర్ ప్రైమ్ మినిస్టర్ అన్నందుకే నాపై ఇడి చేత దాడులు చేయించారు. వారికి నాదగ్గర ఏమీ లభించలేదని చెప్పారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఈ ఎన్నికల్లో ప్రజాతంత్ర వాదులు అందరూ ఏకం కావాలని పిలుపిచ్చారు.

## శివమొగ్గ జిల్లాలో ఎండిన బోర్లు వక్కతోటలకు ట్యాంకర్ల ద్వారా నీరు

**శివమొగ్గ,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

మలెనాడు( వర్షంకురిసే సీమ) ప్రాంతంలో ఈసారి వానలు జాడలేకపోవటంతో అక్కడి వక్కతోటల రైతులు వక్కచెట్లకు నీరు అందించలేక ప్రవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని శివమొగ్గ సాగర సొరబ, తీర్థహళ్లి తాలూకాల్లో సాగతువున్న వక్కల చెట్లకు ఈసారి నీరందక ఎండిపోవటంతో రైతులు వేలాది రూపాయలు పోసి ప్రవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చుకుంటున్నారు. ఏటా మలెనాడు ప్రాంతంలో విరివిగా కురిసే వానలు ఈసారి పదినెలలకు పైగా జాడ కానరాకపోవటంతో రైతులు దిగాలుపడి దిక్కులు చూస్తున్నారు. ఈ జిల్లాలో ప్రధాన వాణిజ్యపంట వక్కల సాగు. దీనికి ఏడాదిపొడవునా వర్షంఒ కురుస్తున్నా కూడా దిగుబడి బాగానే ఉండేది. ఈసారి వానజాడ లేకపోవటం కరువు ఏర్పడటంతో రైతులు వక్కల తోటల సాగును కనాకష్టం మీద నెట్టుకొస్తున్నారు. జిల్లాలో ప్రవహించే తుంగానది, భద్రనది, వరదా నది ఈసారి నీటి జాడలేక ఎండిపోవటంతో రైతులు తమ పొలాలకు నీరందించే దారిలేక నీటి ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ రెండువేల నుంచి మూడువేల రూపాయల ధర పలుకుతుంది. కష్ట కాలంలో రైతులు నీటిని కొంఙుక్కునే దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ జిల్లాలో ఏటా కనీసం 60నుంచి 70వేల హెక్టార్లలో వక్కల సాగు జరుగుతోంది.

## చిక్కబళ్ళాపుర బిజెపి అభ్యర్థి అక్రమాలకు బదులివ్వాల్సిందే

**- ఎంఎల్‌ఎ ప్రదీప్ ఈశ్వర్**



బెంగళూరు కెసిసిసి కార్యాలయంలో మాట్లాడుతున్న చిక్కబళ్లాపుర ఎంఎల్‌ఎ ప్రదీప్ ఈశ్వర్.రమేష్‌బాబు.

**బెంగళూరు,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

చిక్కబళ్లాపుర బిజెపి అభ్యర్థి డాక్టర్ కె.సుధాకర్ జరిపిన అక్రమా లపై బదులివ్వా ల్సిందే అని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ప్రదీప్ ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆయన సోమవా రం కెపిసిసి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిజెపి సర్కారు హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా కోవిడ్ నియంత్రణ కోసం జరిపిన మందుల కొనుగోళ్లలో 2200కోట్ల రూపాయల అ్రకమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కోవిడ్ మందుల కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై కాంగ్రెస్ సర్కారు విచారణకు ఆదేశించిందని తెలిపారు. ఈయన బిజెపి సర్కారు హయాంలో 4వేలకోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని ఆపార్టీ నాయకుడు బసవనగౌడ యత్నాళ్ చేసిన ఆరోపణల గురించి ఇంతవరకు సమాధానం ఇవ్వలేదని చెప్పారు. మంత్రిగా సుధాకర్ చిక్కబళ్లాపు రకు ఏం అభివృద్ది చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అక్రమాల చరిత్ర ఉన్న వ్యక్తిని చిక్కబళ్లాపుర ఓటర్లు ఎన్నుకో కూడదని మనవి చేశారు. ఇలాంటి వ్యక్తి పార్లమెంట్ మెట్లు తొక్కె అర్హత కూడా లేదన్నారు. ఈ ఎన్నికల్లో చిక్కబళ్లాపుర ఓటర్లు ఈయనకు బాగా బుద్దిచెబుతారని తెలిపారు. బిజెపిలో మచ్చపడినవారికే మళ్లీ టిక్కెట్లు ఇస్తున్నారు. వారికి దేశ ప్రజల సంక్షేమం పట్ల అక్కర లేకుండా పోయిందని ఆరోపించారు. చిక్కబళ్లాపుర జిల్లా అభివృద్దికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య 180కోట్ల రూపాయలను మంజూరు చేశారని చెప్పారు. ఈసారి ఇక్కడి ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని మనవి చేశారు.

## బిజెపి తీర్థం పుచ్చుకున్న గాలి జనార్థనరెడ్డి



బెంగళూరులో బిజెపి అధ్యక్షుడు బివై విజయేంద్ర గాలి జనార్ధనరెడ్డికి పార్టీ జెండాను ఇస్తున్న దృశ్యం.

**బెంగళూరు,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

కొప్పళ్‌జిల్లా గంగావతి ఇండిపెం డెంట్ శాసనసభ్యుడు గాలి జనార్థనరెడ్డి సోమవారం బిజెపి తీర్థం పుచ్చుకున్నా రు. బెంగళూరులోని బిజెపి కార్యాలయం లో ఆయన్ని పార్టీ అధ్యక్షుడు బివై. విజయేంద్ర ఆహ్వా నించి పార్టీ జెండాను అప్పగించారు. దాదాపు 13 సంవత్సరాల తరువాత గాలిజనార్థనరెడ్డి బిజెపిలో మళ్లీ తిరిగి చేరారు. తనకు పార్టీ అప్పగించే బాధ్యతలను నిర్వహిస్తామని చెప్పారు. గతంలో బిఎస్, యడ్యూరప్ప అధ్యక్షుడిగా ఉన్నపుడు బిజెపిలో చేరాను. మళ్లీ ఆయన కుమారుడు అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనే మళ్లీ చేరాను. పార్టీ గెలుపునకు పనిచేస్తానని జనార్ధనరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మాజీ సిఎం యడ్యూరప్ప జనార్ధనరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గోన్నారు.

## తుమకూరులో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తాం

**- గుబ్బి ఎంఎల్‌ఎ శ్రీనివాస్**

**తుమకూరు,మార్చి25,ప్రభాతవార్త ప్రతినిధి**

తుమకూరులో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి అధికలీడ్‌ను తెస్తామని గుబ్బి విధానసభ నియోజకవర్గం కాంగ్రెస్ ఎంఎల్‌ఎ ఎస్ఆర్.శ్రీనివాస్ చెప్పారు. ఆయన సోమవారం తుమకూరులో విలేకరులతో మాట్లాడారు. ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్‌పార్టీ 20 ఎంపీలను గెలవనుందని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీకి కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో ఎంపీలను గెలిపించి పంపుతామని చెప్పారు. 20సీట్లు గెలవకపోతే సీఎం కుర్చీ మార్చుతారని బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చెప్పారు. తుమకూరు జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థి ముద్దనుమేగౌడను గెలిపించి తీరతామని చెప్పారు. సిఎం ను బలపరచేందుకు ఈ ఎన్నికలు ఒక అస్త్రం అని చెప్పారు. పేదల ఆకలిని తీర్చి రైతులను మహిళలను ఆదుకుంటున్న సిద్దరామయ్య సిఎంగా కొనసాగాలంటే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలిచితీరాలన్నారు. తుమకూరు బిజెపి అభ్యర్థి సోమణ్ణ ఈ జిలాకు ఏం చేశారని ఆయన్ని పార్టీ అభ్యర్థిగా నిలబెట్టిందని ప్రశ్నించారు. సోమణ్ణ ప్రతీ సారి తుమకూరు సిద్దగంగ మఠానికి వచ్చి పెద్ద స్వామీజికి సాష్టాంగ నమస్కారాలు చేయటం మినహా ఆయన ఈజిల్లాకు ఏం చేశారని నిలదీశారు. కాంగ్రెస్ అభ్యర్థి స్థానికుడు ఆయన్ని గెలిపించితే ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి జెడిఎస్ పార్టీలు చిత్తుచిత్తుగా ఓడి పోతాయని జోస్యం చచెప్పారు.

## వైభవంగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణం



స్వామివారి కళ్యాణంననిర్వహిస్తున్న దృశ్యం

**యాడికి, మార్చి 25 ప్రభాతవార్త**

యాడికి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో అర్చకులు శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల మంత్రోచ్ఛారణలతో భాజాభజంత్రీల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణం నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బ్రాహ్మణపల్లిలో పర్యటించిన జె.సి అశ్మిత్‌రెడ్డి



ప్రజల యోగక్షేమాలను తెలుసుకుంటున్న జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, మార్చి 25 ప్రభాతవార్త**

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సోమవారం తెలుగుదేశం పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. తేదేపాతోనే అభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కానున్న ఎన్నికల్లో తేదేపాను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తేదేపా కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, జె.సి అభిమానులు పాల్గొన్నారు.

## తేదేపాను ఆదరించండి



అభివాదం చేస్తున్న జెసి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, మార్చి 25 ప్రభాతవార్త**

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ఆ పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణంలోని సుంకులమ్మపాలెం, తూర్పుపాలెంలో సోమవారం బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటా తిరుగుతూ ప్రజల యోగక్షేమాలు, వారి సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తేదేపాను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తేదేపా కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, జనసేన సమన్వయకర్త కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, జె.సి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీబుగ్గరామలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు

**తాడిపత్రిఅర్బన్, మార్చి 25 ప్రభాతవార్త**



పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వర స్వామికి సోమవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో వెండికవచముఖంతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, తేజస్వామి, గంగాధర్‌శర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

## నూతన గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి



గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, మార్చి 25 ప్రభాతవార్త**

పట్టణంలోని యల్లనూరురోడ్డులోని కృష్ణాపురం 2వరోడ్డులో తలపాగల మహేశ్వర్‌రెడ్డి నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వారు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## గొడవలు సృష్టిస్తే తాట తీస్తా - డిఎస్‌పి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటశివారెడ్డి

**యల్లనూరు, మార్చి 25 ప్రభాతవార్త**

రానున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ఎవరైనా గొడవలు సృష్టిస్త తాట తీస్తానని అనంతపురం రూరల్ డిఎస్‌పి వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొడకొండ్లపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా గ్రామంలో ఎలాంటి గొడవల జోలికి వెళ్లకూడదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని రౌడీషీటర్లను హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. అలా కాకుండా చట్టాన్ని అతిక్రమిస్తే తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని డిఎస్‌పి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ సుబ్రమణ్యం, ఎస్ఐ గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అక్కదేవతల గిరిగుల ఊరేగింపు



అమ్మదేవతల గిరుగులను ఊరేగిస్తున్న దృశ్యం

**అమడగూరు, మార్చి 25 ప్రభాతవార్త**

మండలంలోని చినగానపల్లిలో సోమవారం అక్కదేవతల గిరిగుల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వల్లపు శ్రీనాథ్ మాట్లాడుతూ ఏడు మంది అక్కదేవతల పేర్ల మీద గిరిగులు తయారు చేసి ప్రతి సంవత్సరం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ముగ్గురు దేవతల గిరిగులు తయారు చేయించామని వచ్చే ఏడాది మిగిలిన నలుగురు గిరిగులు తయారు చేయించి మొత్తం ఏడు మంది అక్కదేవతల గిరిగులను ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల భక్తుల కోరిక మేరకు ఈ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఎటువంటి ఇబ్బందులు వున్నా, శరీరపీడలు, పిశాచిలు పట్టిన వారికి కూడా వారిని విడిచి వెళ్లే మార్గాలు అక్కదేవతలు చూసుకుంటారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజంత్రీ శివ, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న ముఖ్యమంత్రి కదిరికి రాక

**- ఏర్పాట్లను పరిశీలించిన ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రఘురామ్, మగ్బుల్**

**కదిరి, మార్చి 25 ప్రభాతవార్త**



ఏర్పాట్లను పరనిశీలిస్తున్న తలసీల రఘురామ్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఏప్రిల్ 1న కదిరి పర్యటనకు వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కఓఆర్డినేటర్ తలసీల రఘురామ్ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మగ్బుల్‌తోకలిసి సోమవారం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్ ఏప్రిల్ 1న రోడ్‌షో, ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నట్లు పార్టీ వర్గాల ద్వారా సమాచారం. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ తలసీల రఘురామ్, పివిఆర్ ఫంక్షన్ హాల్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనతోపాటు వేదిక పరిపీలనను క్షుణ్ణంగా పరిశీలించారు. వీరితోపాటు రాష్ట్రప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజిమున్నీసాసాధిక్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టెక్నికల్ అసిస్టెంట్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే దుద్దుకుంట



టెక్నికల్ అసిస్టెంట్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

**అమడగూరు, మార్చి 25 ప్రభాతవార్త**

మండలంలోని ఏ.కొత్తపల్లి బొబ్బిలికోట గ్రామంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్‌ను సోమవారం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. మంజునాథ్ నెల రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంజునాథ్‌ను పరామర్శించి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందచేశారు. తమకు అన్ని విధాల అండగా వుంటామని ఆయన వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జల ప్రసాద్‌రెడ్డి, జెడ్‌పిటిసి కవిత శంకర్‌రెడ్డి, కన్వీనర్ సూరిరెడ్డి, సర్పంచులు షబ్బీర్, శ్రీధర్‌రెడ్డి, రాజు, సురేందర్‌రెడ్డి, రంగారెడ్డి, సరస్వతి శంకర్, ఆదినారాయణ, ఎంపిటిసిలు పెద్దప్పయ్య, శ్రీరాములు, నాగరాజు, సూర్యనారాయణరెడ్డి, సహకార బ్యాంకు అధ్యక్షులు బొమ్మిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, సచివాలయం కన్వీనర్లు హరినాథ్‌రెడ్డి, జయప్ప, దొడ్డప్ప, ఖాజాపీరు, తబ్రేజ్‌బాష, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్‌సిపిలోకి పలువురు చేరిక



పార్టీలో చేరిన వారికి సాదరంగా ఆహ్వానిస్తున్న మగ్బుల్ అహ్మద్

**కదిరి, మార్చి 25 ప్రభాతవార్త**

కదిరి నియోజకవర్గపరిధిలోని శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి, టాక్సీ ఓనటర్స్, డ్రైవర్స్ అసోషియేషన్ సభ్యులు 100 మంది వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎస్.మగ్బుల్ అహ్మద్ ఆధ్వర్యంలో పార్టీలోకి చేరిన వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అందరికీ వైఎస్‌ఆర్‌సిపితోనే న్యాయం జరిగిందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. మగ్బుల్ అహ్మద్‌ను కదిరి ఎమ్మెల్యేగా అత్యధజక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. అసోషియేషన్ ప్రెసిడెంట్ సూర్యశేఖర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాషా, రాజేంద్ర, మహేంద్ర, ఉమర్ బాషా, ఫరూఖ్‌లు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న బిఎస్.మగ్బుల్



ప్రార్థనల్లో పాల్గొన్న బిఎస్.మగ్బుల్ అహ్మద్

**కదిరి, మార్చి 25 ప్రభాతవార్త**

కదిరి మున్సిపల్ ఫరిధిలోని మదనపల్లి రోడ్డులోగల అల్‌ఖైర్ మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మగ్బుల్ పాల్గొన్నారు. కార్యక్రమంలోవైసీపీ నాయకులు పరికి సాధిక్, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నియంత్రణపై అలుపెరగని పోరాటం చేద్దాం

**- ప్రపంచ క్షయరోగ దినాచరణ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాహుల్‌శరణప్ప సంకనూరు**



ప్రపంచ క్షయరోగ దినోత్సవం సందర్భంగా ర్యాలీ జరిపినప్పటి దృశ్యం

**బళ్లారి, మార్చి25, ప్రభాతవార్త**

ప్రపంచంలోని అనేక దేశాలతో పాటు భారతదేశంలోనూ క్షయ రోగ కేసులు నేటికీ కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బళ్లారి జిల్లాను క్షయ రహిత జిల్లాగా చేసేందుకు అందరూ అలుపెరగని పోరాటం క్షయవ్యాధిపై చేయాలని, క్షయవ్యాధి సోకిన రోగుల్ని కట్టుదిట్టమైన చికిత్స కల్పించి, క్షయ నుంచి కాపాడే సంకల్పం పొందాలని జెడ్పీ సీఈఓ రాహుల్‌శరణప్ప సంకనూరు పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖల సంయుక్తాధ్వర్యంలో బృహత్ జాగృతి ర్యాలీని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో, పారిశ్రామికవాడల ప్రాంతాల్లో హెచ్చుగా క్షయరోగుల్ని గుర్తిస్తున్నట్లు, అటువంటి ప్రాంతాల్లో ముందు జాగ్రత్తగా ఆరోగ్య సిబ్బంది డోర్ టూ డోర్ సందర్శించి తగు వైద్య పరీక్షలు నిర్వహించి ప్రాథమిక దశలోనే రోగుల్ని గుర్తించే కార్యం చేపట్టాలని, వారికి చికిత్స విధానం కల్పించి, వ్యవధి విధించిన మేరకు రెగ్యులర్‌గా క్షయ ఔషధాలు అందజేయాలని చెప్పారు.

డీహెచ్‌ఓ వై.రమేష్‌బాబు మాట్లాడుతూ గత సంవత్సరంలో 53,708 మంది లక్ష్యం పెట్టుకున్నా 66,888 మందికి కఫం పరీక్ష జరిపినట్లు, వీరిలో 2,747 మంది క్షయరోగులుగా కనుగొన్నట్లు, వారికి చికిత్స పూర్తి అయ్యి, 83 శాతం మంది కోలుకున్నట్లు చెప్పారు. 55 మంది దాతల నుంచి 1068 మందికి 3,668 కిట్లను క్షయ రోగులకు పంపిణీ చేసినట్లు, జిందాల్ సంస్థతో పాటు బీకేజీ గ్రూప్స్, కుమారస్వామి మైనింగ్స్, జీనీ ప్రొడక్ట్స్‌తో పాటు సమాజ సేవకులకు, వైద్యాధికారులు, ఇతరులు ముందుకొచ్చి రోగులకు మద్దతునిస్తున్నట్లు, ప్రస్తుతం జిల్లాలో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గినట్లు, మున్ముందు కూడా ఇదే కార్యాచరణ కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంలో జిల్లా క్షయరోగ నిర్మూలనాధికారి డాక్టర్ ఇంద్రాణి తదితరులు ప్రసంగించారు. ఉదయం జాతాలో డాక్టర్ ఎన్.బసారెడ్డి తదితర వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, వందలాది మంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కస్తూరిబాయి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

**-సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు**

**ముదిగుబ్బ, మార్చి 25 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన ముదిగుబ్బ మేజర్ పంచాయతీలోని కస్తూరిబాయి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న కస్తూరిబాయి కాలనీలో ప్రారంభం నుండి నేటి వరకు అనేక సమస్యలు తిష్టవేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కస్తూరిబా పాఠశాల సమీపంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో 2017 నుండి నేటి వరకు శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతూ పట్టణంలోని ఆ ప్రాంతం అతి పెద్దకాలనీగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు అక్కడ దాదాపు 300 పైగా ఇళ్లను నిర్మించుకుని వున్నారని దాదాపు వెయ్యి మంది జనాభా నివసిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అనేక సమస్యలు తిష్ట వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీస సౌకర్యాలకు కూడా నోచుకోకపోవడం దారుణమన్నారు. అయితే ఇంత కాలనీ ఏర్పడినప్పటికి పంచాయతీవారు డోర్ నెంబర్లు వేయకపోవడమే కాక కనీస అవసరాలైన తాగునీటి సౌకర్యం, వీధిలైట్లు ఏర్పాటు చేయకపోవడంతో కాలనీలో రాత్రి సమయంలో చీకటి నెలకొందన్నారు. డ్రైనేజి కాలువలు, సిసి రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇక్కడ నివసిస్తున్న నప్రజలకే కాకుండా ఇక్కడ వున్న కెజిబివి పాఠశాల విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. రెండు మూడు సంవత్సరాల నుండి ఇక్కడ నివసిస్తున్న వారు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యలు విన్నవించుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో నిర్మించుకున్న ఇళ్లకు పంచాయతీ అధికారులు డోర్ నెంబర్లు వేయాలని ఆయన పేర్కొన్నారు.

## కురుగోడు శ్రీ దొడ్డబసవేశ్వర జాతరకు ఎమ్మెల్యే గణేష్‌చే పాదయాత్ర



కంప్లీ నుంచి కురుగోడుకు పాదయాత్రగా వెళ్తున్న కంప్లీ ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్

**బళ్లారి, మార్చి25, ప్రభాతవార్త**

జిల్లాలోని కురుగోడులో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ దొడ్డబసవేశ్వర జాతర మహోత్సవం సోమవారంనాడు జరిగింది. ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు కంప్లీ క్షేత్రం ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్ తన అనుచరులతో, పార్టీ నాయకులతో కలిసి కంప్లీ పట్టణంలోని పేటే బసవేశ్వర దేవస్థానంలో విశేష పూజలు చేసి ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభం జరగాలని ప్రార్థించడం ద్వారా కురుగోడు శ్రీ దొడ్డ బసవేశ్వర, శ్రీ నీలమ్మదేవి జాతర మహోత్సవం సందర్భంగా సంకల్ప పాదయాత్రను చేపట్టారు. కంప్లీ క్షేత్రం ప్రజలు సుఖశాంతులతో జీవించాలని శ్రీ దొడ్డబసవేశ్వరుడిని ప్రార్థించేందుకు ఈ పాదయాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్యే వర్గీయులు తెలిపారు. నెల్లుడి కొట్టాల్, ఎమ్మిగనూరు, కల్లుకంభ రగామాల మీదుగా వేలాది మంది అనుచరులు, అభిమానులతో దేవాలయానికి రెండు గంటల వ్యవధిలో చేరుకుని విశేష పూజలు చేసి, దేవుడిని ప్రార్థించారు. అనంతరం దొడ్డ బసవేశ్వర రథోత్సవంలో పాల్గొన్న లక్షలాది మంది భక్తజనులకు వందనం సమర్పణ చేశారు. రథోత్సవం సందర్భంగా దేవస్థానంలో స్వామి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగలేదు.

## రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

**బళ్లారి, మార్చి25, ప్రభాతవార్త**



జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అనధీకృతంగా తరలిస్తున్న రూ.1,30,380 నగదు డబ్బును శనివారంనాడు రూరల్ క్షేత్రం పరిధిలోని వై.బూదిహాల్ చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల నియమావళి కట్టుదిట్టంగా అమలుపరిచేందుకు ఇప్పటికే వివిధ బృందాలను నియమించినట్లు, అవి కార్యాచరణలో ఉన్నట్లు పేర్కొన్నారు. 16 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 24 ఎస్ఎస్‌టీ టీంలు, 7 ఎక్సైజ్ పోలీసుల టీంలు కార్యం నిర్వహిస్తున్నాయని, ఇప్పటివరకు మొత్తం 45 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

**- 658.58 లీటర్ల మద్యం బాటిళ్ల పట్టివేత**

చెక్ పోస్టుల వద్ద అక్రమంగా తరలిస్తున్న 658.58 లీటర్ల మద్యం బాటిళ్ల బాక్సులను స్వాధీన పరుచుకున్నట్లు, వీటి విలువ రూ.2,57,990గా ఉన్నట్లు, కేసు నమోదు చేసినట్లు జిల్లాధికారి తెలిపారు.

## రూ.26 లక్షల నగదు స్వాధీనం

**బళ్లారి, మార్చి25, ప్రభాతవార్త**



నగరంలోని పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద బైకుపై ఇద్దరు వ్యక్తులు ఎటువంటి దాఖలాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.26 లక్షల నగదును ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు తెలిపారు. బళ్లారికి చెందిన సురేష్, సురేష్‌గుప్తా అనే వ్యక్తులు రూ.26 లక్షల నగదును తీసుకెళ్తుండగా అందుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీన పరుచుకున్నట్లు, కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు ప్రకటనలో తెలిపారు.

బళ్లారిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.26 లక్షల నగదు

# వైభవంగా శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి రథోత్సవం

**- రథోత్సవంలో వేలాదిగా పాల్గొన్న భక్తులు - భక్తులకు మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేసిన స్వచ్ఛంధ సంస్థలు**



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**యాడికి, మార్చి 25 ప్రభాతవార్త**

యాడికి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి గంగహారణము, బిందెసేవ, ఆగమ విహిత కార్యక్రమాలు, బలిహరణాలు, తిరుమల వాదుల ఆరాధన, సహస్రనామపూజ, నివేదన, విశ్వరూప సందర్శన, మహామంగళహారతి మంత్ర పుష్పాలతో మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కళ్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద నుండి రథోత్సవం సిండికేట్‌బ్యాంకు, పాతపోలీసుస్టేషన్ మీదుగా అమ్మవారిశాల నుండి ఆర్యవైశ్యవీధి గుండా తిరిగి యదాస్థానానికి చేరుకుంది. భక్తులు చెన్నకేశవస్వామి గోవిందా..గోవిందా అంటూ స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఆయా కాలనీల్లోని మహిళలు టెంకాయలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్, వాల్మీకి సంఘం, వడ్డెర సంఘం, వాసవిసేవాసంఘం, తదితర సామాజిక సేవా సంస్థలు భక్తులకు మజ్జిగ, చల్లని తాగునీటిని పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ నాగార్జునరెడ్డి స్థానిక పోలీసులు, ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిలు వేర్వేరుగా హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



